క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు రూ.5 లక్షలు అందజేత



నందిగామటౌన్: పట్టణంలోని రెండవ వార్డుకు చెందిన బేరోతుల ఆదినారాయణ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ. ఐదు లక్షల నగదును మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, కౌన్సిలర్ తానూరి రాము, నాయకులు నల్లమల్లి మురళి, చింతోటి ప్రసాద్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు రూ.25 లక్షలు మంజూరు

పెనుగంచిప్రోలు(వత్సవాయి): మండల కేంద్రం పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్ నుంచి అమ్మవారి ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.25 లక్షలు జిల్లా పరిషత్ నిధులు విడుదలైనట్లు జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి తెలిపారు. బీటీ రోడ్డు ఆవశ్యకత గురించి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు పరిస్థితిని వివరించి నిధులు మంజూరుచేయించారు. మంగళవారం పెనుగంచిప్రోలు, వత్సవాయి జెడ్పీటీసీ, ఎంపీపీలు వూట్ల నాగమణి, యేశపోగు దేవమణి శ్రీనివాస్, ఎంపీపీలు మార్కపూడి గాంధీ, కొలుసు రమాదేవి, జెడ్పీ చైర్‌పర్సన్ హారికను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం



పెనుగంచిప్రోలు(వత్సవాయి): గ్రామంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన కాకాని గోపయ్య, విజయలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళంగా అందించారు. నూతన ఆలయ నిర్మాణం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ విరాళాన్ని ఆలయ నిర్మాణ కర్త వాసిరెడ్డి బెనర్జీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ దాతలను సత్కరించింది.

ఎస్టీయూ నూతన కార్యవర్గ ఎన్నిక

కంచికచర్ల: స్థానిక ఎన్‌జీఓ హోంలో కంచికచర్ల, వీరులపాడు మండలాల రాష్ట్రోపాధ్యాయ సంఘ కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగిందని సంఘ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య తెలిపారు. ఎన్నికల నిర్వహణ జిల్లా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కంచికచర్ల మండల ఎస్టీయూ అధ్యక్షుడుగా నంద్రు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా బళ్లా రవికుమార్, ఆర్థిక కార్యదర్శిగా దుర్గాప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. వీరులపాడు మండల సంఘ అధ్యక్షుడుగా జె.శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బాణావత్ సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శిగా మద్దాల రమేష్‌లను ఎన్నుకున్నట్టు తెలిపారు.

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఖరీఫ్ సీజన్ 2023–24కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారానే ధాన్యం కొనుగోలు చేస్తామని కోఆపరేటివ్ జిల్లా డెప్యూటీ రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆర్బీకేల పరిధిలోని టెక్నికల్ అసిస్టెంట్‌లు, పీపీసీ ఇన్‌చార్జ్‌లు, వీఏవోలకు ధాన్యం కొనుగోలుపై మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ఆర్బీకేల ద్వారానే జరగాలన్నారు. మండలంలోని 22 ఆర్బీకేలలో ఆయా గ్రామాల పరిధిలోని రైతులకు ప్రభుత్వ మద్దతు ధరను వివరించి ఆర్బీకేల ద్వారా విక్రయించేలా ప్రోత్సహించాలన్నారు. ఈ వ్యవసాయ సీజన్‌లో ధాన్యానికి క్వింటాకు సాధారణ రకం రూ.2,183, గ్రేడ్–ఎ రూ. 2,203 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీవో కార్యాలయ ఏవో శర్మ, పీడీఎస్ డీటీ విజయ్ కుమార్, టీఏలు రవికుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో రైతులకు ప్రయోజనం

వత్సవాయి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వల్ల రైతులకు ప్రయోజనాలు అధికంగా ఉన్నాయని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ కె.రమేష్, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య తెలిపారు. 70 వ సహకార సంఘ వారోత్సవాల సందర్భంగా వత్సవాయిలోని కేడీసీసీ బ్యాంకు, సొసైటీల వద్ద సహకార సంఘ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎకరాకు రూ.6 లక్షల వరకు రుణాలను అందిస్తున్నామన్నారు. రైతులు రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పాటు నందించాలని కోరారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రం సుభిక్షం

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన
- జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రం బాగుండాలంటే, ప్రజలంతా ఆనందంగా జీవించాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం స్థానిక 5వ సచివాలయం, సీతారామపురంలో జరిగింది. 5వ సచివాలయంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్ తదితర నేతలతో కలిసి ఆవిష్కరించారు. ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు.

అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న టీడీపీ నేతలు

పట్టణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషి చేస్తుంటే, ప్రజల్లో మంచిపేరు వస్తుందన్న ఈర్ష్యతో ప్రతిపక్ష టీడీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేస్తూ అడుగడుగునా ఆటంకం కలిగిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. జగనన్న ఇళ్ల స్థలాలు, పర్యాటక కేంద్రంగా ఊర చెరువు అభివృద్ధిపై కోర్టులో కేసులు వేశారని గుర్తుచేశారు. 5 వ సచివాలయం పరిధిలో ఈ నాలుగున్నరేళ్లలో రూ.12 కోట్లకు పైగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, పార్టీ ఎస్టీ సెల్, కార్మిక విభాగాల అధ్యక్షులు బద్దూనాయక్, గోగుల వెంకయ్య, గృహసారథులు పాల్గొన్నారు.

కంచికచర్లలో వై ఏపీ నీడ్స్ జగన్

కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కొత్తపేటలో సర్పంచి పత్తిపాటి సునీత అధ్యక్షతన మంగళవారం రాత్రి పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు జగనన్న ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. సమావేశంలో ఉపసర్పంచి ముప్పాళ్ల సత్యనారాయణ, మాజీ సర్పంచి ముప్పాళ్ల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, ప్రత్తిపాటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత ధ్యేయంగా పాలన

నందిగామటౌన్: మహిళా సాధికారత, మహిళా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని ఏడు, ఎనిమిది వార్డుల పరిధిలోని నాలుగవ సచివాలయంలో, మండలంలోని అంబారుపేట, చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామాల్లో మంగళవారం రాత్రి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా సచివాలయాలలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పని తీరును బేరీజు వేసుకుని మీకు మంచి జరిగిందని భావిస్తే రానున్న ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌లు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కందుల నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పాకాలపాటి కిరణ్, ఓర్సు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పెమ్మసాని నరసింహారావు, నాయకులు మన్నెం దాసు, అన్నం పిచ్చయ్య, నెలకుదిటి శివనాగేశ్వరరావు, బలపోగు రమ, మున్సిపల్ కమిషనర్ జయరాం పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్



నందిగామలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

సుబ్బాయిగూడెం(వత్సవాయి): ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని దానికనుగుణంగానే పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు తెలిపారు. మంగళవారం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలుచేసి ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను అమలు చేసే ఆలోచన చేస్తుండడం మనకు గర్వకారణమన్నారు. ఇటువంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, సచివాలయ మండల కన్వీనర్ కన్నమూల శామ్యూల్, ఎంపీటీసీ వెల్ది ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు బ్రహ్మేశ్వరరావు, బెజవాడ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, క్రాంతి, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మంచి చేసే సీఎం జగన్

వేదాద్రి(జగ్గయ్యపేట): అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గ్రామంలో మంగళవారం రాత్రి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డును, పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను కులమతాలకు అతీతంగా అందించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌లు గుడారు పేరయ్య, బోగ్యా, వైఎస్సార్‌సీపీ నాయకులు బుజ్జి నాయక్, షాఉద్దీన్, సాయి, కాసరగడ్డ సీతమ్మ, ఆనంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు

వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

తాటిగుమ్మి(వీరులపాడు): దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని తాటిగుమ్మి గ్రామంలో మంగళవారం రాత్రి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల వివరాల డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎటువంటి వివక్షకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా అందించింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, నాయకులు పలకా మోహన్‌రెడ్డి, యాదాల సుజాత, ఎంపీడీవో అరుంధతీ దేవి, నాయకులు పాల్గొన్నారు.



తాటిగుమ్మిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

- పుస్తక పఠనం అలవర్చుకోవాలి
- నందిగామలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని గ్రంథాలయ శాఖలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాల ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రంథాలయాలలో డిజిటలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించటంతో పాటు పుస్తక పఠనానికి వచ్చే వారికి అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పలు వేషధారణల్లో ఉన్న విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రంథాలయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వత్సవాయి: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని పలువురు వక్తలు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండల కేంద్రం వత్సవాయిలోని గ్రేడ్–3 శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను సర్పంచ్ భూక్యా సీతమ్మ ప్రారంభించారు. ముందుగా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పెనుగంచిప్రోలులో...

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అనిగండ్లపాడులోని శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో మంగళవారం 56 వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు శతక పద్యాల పోటీలు నిర్వహించారు. కవి, ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ బద్దూనాయక్, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, కవి, ఎస్.నరసింహరాజు, తెలుగు ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, బీడీసీ నాగమల్లిక, రమేష్, సత్యావతి వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



నందిగామలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పేటలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్



కంచికచర్లలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సర్పంచి సునీత

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచి వేల్పుల సునీత జ్యోతి ప్రజ్వలన చేశారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జవహర్‌లాల్ నెహ్రూ, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి సునీత మాట్లాడుతూ గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



చందాపురం లోని ఎంపీయూపీ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ధర్మవరప్పాడుతండాలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో చిట్టిబాబు

వత్సవాయి: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. కన్నెవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హైదరాబాద్ అసోసియేషన్ సభ్యులు కండ్రిక హనుమంతరావు, సామ్యేలు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కేపీ రావు పాల్గొని విద్యార్థులకు ఆటపాటలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చావా దుర్గారాణి, ఎంపీటీసీ లావుడియా లక్ష్మి, ఎస్‌ఎంసీ చైర్మన్ పులి శ్రీను పాల్గొన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం అజ్మీరు కొండ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

నందిగామలో...

నందిగామ: పలు పాఠశాలల్లో మంగళవారం నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలంలోని చందాపురం ఎంపీయూపీ పాఠశాలల్లో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. రామిరెడ్డిపల్లి, పల్లగిరి గ్రామాల్లోని ఎంపీయూపీ పాఠశాలలలో నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

పేటలో ఘనంగా బాలల దినోత్సవం

జగ్గయ్యపేట: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ధర్మవరప్పాడు తండా మండల పరిషత్ పాఠశాలలో ఎంఈవో–2 చిట్టిబాబు జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకొంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, మంగతాయమ్మ, దయామణి, వసంత తదితరులు పాల్గొన్నారు. గంర్డాయి, ముక్త్యాల గ్రామాల్లోని మండల పరిషత్ పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. పలువురు విద్యార్థులు చేపట్టిన వేషధారణలు ఆకట్టుకున్నాయి.

శివాలయాల్లో కార్తిక మాస ప్రత్యేక పూజలు



నందిగామ విజ్ఞాన నందీశ్వర స్వామి వారి ఆలయంలో పంచామృత అభిషేకాలు చేస్తున్న న్యాయమూర్తి



నందిగామ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తికదీపం వెలిగిస్తున్న మహిళలు

నందిగామ: కార్తిక మాసం ప్రారంభం నేపథ్యంలో మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా శివాలయాలలో విశేష పూజలు జరిగాయి. మొదటిరోజు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తే మంచిదని భక్తులు నమ్ముతారు. ఈ నేపథ్యంలో వేకువజాము నుంచే ఆలయాలకు భక్తుల రాక ప్రారంభమైంది. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పట్టణ శివారు మున్నేటి తీరాన గల విజ్ఞాన నందీశ్వర స్వామి వారి ఆలయంలో పట్టణంతో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు వచ్చి స్వామివారికి స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు దంపతులు స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. వీటితోపాటు అన్ని గ్రామాల్లో గల శివాలయాలలో విశేష పూజలు జరిగాయి.

ఆలయాలలో కార్తిక శోభ

జగ్గయ్యపేట: కార్తిక మాసం ప్రారంభం కావటంతో మండలంలోని పలు శైవ క్షేత్రాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్త్యాల గ్రామ సమీపంలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రంలో కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక దీపాలు వెలిగించిన పలువురు దంపతులు శివలింగాలను ప్రతిష్ఠించారు. భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తిక మాసోత్సవాల సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

రాజన్న ఉచిత భోజనానికి 30 క్వింటాళ్ల బియ్యం వితరణ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద అనాథలు, అభాగ్యులు, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన వలస కార్మికులు, విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజన్న ఉచిత భోజన కార్యక్రమానికి పలువురు దాతలు సహకారం అందజేస్తున్నారు. పెనుగంచిప్రోలు మండలం కొణకంచి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రూ.1.50 లక్షల విలువైన 30 క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కొణకంచి గ్రామ సర్పంచ్ గోనెల దేవి, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరెడ్డి, దేవస్థానం చైర్మన్ వెంకట్రావు, దేవస్థానం మాజీ చైర్మన్ వెంకయ్య తదితరులు విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను చేతుల మీదుగా రాజన్న ఉచిత భోజనం నిర్వాహకులకు బియ్యాన్ని అందజేశారు.



రాజన్న ఉచిత భోజనానికి 30 క్వింటాళ్ల బియ్యాన్ని వితరణగా అందజేస్తున్న కొణకంచి వైఎస్సార్ సీపీ నాయకులు

చేపల కూరతో ప్రత్యేక భోజనం

పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన రాజన్న ఉచిత భోజన క్యాంటీన్‌లో మంగళవారం ప్రభుత్వ విప్ ఉదయభాను తనయుడు సామినేని ప్రశాంత్‌బాబు జన్మదినం సందర్భంగా సుమారు 2 వేల మందికి చేపల కూరతో ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు.

భీమవరం ప్రజలకు రూ.18 కోట్లు లబ్ధి

భీమవరం(వత్సవాయి): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల వల్ల భీమవరం గ్రామస్తులకు రూ.18 కోట్ల మేర లబ్ధి చేకూరింది. సచివాలయం – 2 పరిధిలో మంగళవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ భీమాల సుజాత, ఎంపీటీసీలు కె.చెన్నమ్మ, సుధాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకుంట్ల వెంకటరెడ్డి, గుండం రంగారెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష, పంచాయతీ కార్యదర్శి షేక్ చాంద్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుల మృతి బాధాకరం

మృతదేహాలను సందర్శించి నివాళులర్పించిన ఎమ్మెల్యే

నందిగామటౌన్: ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకులు మునేటిలో పడి మృతి చెందటం బాధాకరమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల మండలం కీసర మునేటిలో పడి మృతి చెందిన ఐతవరం గ్రామానికి చెందిన వినీష్, సంతోష్ కుమార్, గణేష్ మృతదేహాలను మంగళవారం ఆయన సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ బాధిత కుటుంబాల ఆవేదన, రోదన ఎవరూ తీర్చలేనిదన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కీసర మున్నేరు అత్యంత ప్రమాదకరంగా ఉందని కార్తిక మాసం సందర్భంగా పవిత్ర స్నానాలకు వెళ్ల వద్దని ఆయన విజ్ఞప్తిచేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, షేక్ కరిముల్లా, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఐతవరంలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వీరులపాడు మండల సర్వసభ్య సమావేశం

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాలలో వెలుగులు నింపారని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండల కేంద్రం జుజ్జూరులోని జెల్లి ఏసోబు కల్యాణ మండపంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించినట్లు ఎంపీడీవో అరుంధతీ దేవి చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వేమూరి ఆదాం, షేక్ నాగుల్‌మీరా, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్‌లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి